నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, గురువారం 6 మార్చి 2025 | MAHABUBNAGAR NARAYANPET

కన్వేయర్ బెల్టు పనిచేయకపోవడంతో నిర్మానుష్యంగా మారిన ఎస్ఎల్‌బీసీ సొరంగం

అడుగడుగునా.. అడ్డంకులు

- నాలుగు వరుసల్లో సెగ్మెంట్లు కూలిపడే ప్రమాదం?

- ఎస్ఎల్‌బీసీలో కన్వేయర్ బెల్ట్ కట్
- ముందుకు సాగని సహాయక చర్యలు
- మృతదేహాల ఆచూకీకి మరిన్ని రోజులు పట్టే అవకాశం
- బెల్ట్ మరమ్మతులు చేస్తేనే సహాయక చర్యల్లో పురోగతి

నాగర్‌కర్నూల్/అచ్చంపేట రూరల్, మార్చి 5 : ఎల్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల మృతదేహాలను వెలికి తీయడం అధికారులు, రెస్క్యూ టీంలకు పరీక్షగా మారింది. 12రోజుల కిందట ఘటన చోటుచేసుకోగా, చేపడుతున్న సహాయక చర్యలేవీ ఫలితం లేకుండా పోతున్నాయి. టన్నెల్‌లో పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించేందుకు లోకో ట్రైన్‌ను ఉపయోగించిన అధికారులు పూర్తిస్థాయిలో సక్సెస్ కాలేకపోయారు. టీబీఎం మిషన్‌కు అనుసంధానంగా ఉన్న కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేసి రన్నింగ్ చేస్తేగానీ సహాయక చర్యలు ముందుకు సాగవని గుర్తించి మరమ్మతులు చేపట్టారు. కానీ కన్వేయర్ బెల్ట్ సహాయంతో మట్టిని బయటకు తీసే ప్రక్రియ కొన్ని గంటలు మాత్రమే సాగింది. గంటల వ్యవధిలో నడిచిన కన్వేయర్ బెల్ట్ సొరంగం లోపలి భాగంగా మంగళవారం మధ్యరాత్రి 3గంటల ప్రాంతంలో తెగిపోవడంతో సహాయక చర్యలకు పూర్తిగా ఆటంకం కలిగిందని కార్మికులు పేర్కొంటున్నారు. మంగళవారం మధ్యరాత్రి వరకు కన్వేయర్ బెల్ట్ ద్వారా జరిగిన సహాయక చర్యల్లో భాగంగా రెస్క్యూ టీం బృందం గతంలో పేరుకుపోయిన మట్టిని మాత్రమే బయటకు తీయగలిగారని తెలుస్తున్నది. నాలుగు రోజులుగా నీటిని తోడుతూ తేలిన మట్టిని టన్నెల్‌కు ఇరువైపులాఈ ఉండిపోయిందని రిస్క్యూటీమ్ బృందాలు పేర్కొంటున్నాయి. కన్వేయర్ బెల్ట్ కొన్ని గంటలు మాత్రమే రన్ చేయడంతో 13 కిలోమీటర్ల పొడవునా గతంలోనే మిగిలిన మట్టి, కంకర, టీబీఎం మిషన్‌కు తొలగించిన శకలాలు మా త్రమే బయటకు తేగలిగారని తెలుస్తున్నది.



కన్వేయర్ బెల్ట్

మృతదేహాల ఆచూకీకి రోజులు పట్టే అవకాశం..

కన్వేయర్ బెల్ట్ తెగిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగింది. దీంతో మృతదేహాల గుర్తింపు మరిన్ని రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు రెస్క్యూటీమ్ బృందం సభ్యులు టన్నెల్‌లో చర్చించుకోవడం కనిపించింది. సొరంగంలో తెగిపడిన కన్వేయర్ బెల్ట్‌ను అక్కడి నుంచే మరమ్మతులు చేయాల్సి ఉండడంతో దానిని బాగు చేసేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశమున్నది. అప్పటి వరకు టన్నెల్‌లో నీటితోపాటు బురద మరింత పేరుకుపోయే అవకాశం ఉన్నట్లు తెలిసింది. లోకో ట్రైన్ ద్వారా గతంలో మాదిరి బురదను తరలించేందుకు ఒక్క ట్రిప్పునకు దాదాపు 5గంటల సమయం పడుతుండడంతో, బురద మట్టిని తొలగించేందుకు బెల్ట్‌కు మరమ్మతులు చేయడమే సరైన నిర్ణయమని రెస్క్యూటీమ్ బృందాలు పేర్కొంటున్నాయి. ఒక్కో షిఫ్ట్‌గా దాదాపు 70 నుంచి 100 మంది రెస్క్యూటీమ్‌లు టన్నెల్‌లోకి వెళ్తున్నా తొలగించిన మట్టిని బయటకు తీసే మార్గమైన కన్వేయర్ బెల్ట్ పనిచేయకపోవడంతో రెస్క్యూటీమ్ చేస్తున్న పనులకు ఫలితం లేకుండా పోతోంది.

సిమెంట్ సెగ్మెంట్ కూలే ప్రమాదం..

టన్నెల్‌లో 13వ కిలోమీటర్ నుంచి 14 కిలోమీటరు వరకు నాలుగు వరుసల్లో ఏర్పాటు చేసిన సిమెంట్ సెగ్మెంట్లు కూలిపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదాన్ని బుధవారం రెస్క్యూటీమ్ బృందాలు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు సమాచారం. మరమ్మతులు చేపట్టిన కన్వేయర్ బెల్ట్ సాయంతో మట్టి, బురదను బయటకు తరలించడం రిస్క్యూటీమ్‌కు ఇబ్బందిగా మారినట్లు తెలుస్తున్నది. ఇంతలోనే సొరంగం లోపలిభాగంలో బెల్ట్ అకస్మాత్తుగా తెగిపోవడంతో సహాయక చర్యలకు పూర్తిగా ఆటంకం కలిగినట్లు రిస్క్యూటీమ్ బృందాలు పేర్కొంటున్నాయి. ఇంత క్లిష్ట పరిస్థితుల్లో ఫలానా చోట మృతదేహాలు ఉన్నాయని గుర్తించినప్పటికీ బయటకు తీసేందుకు మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నది. ఏదేమైనా 12వ రోజులైనా టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల జాడ గుర్తించలేకపోవడంతో కార్మికుల కుటుంబాల నుంచి విమర్శలు వస్తున్నాయి.

కనిపించని పురోగతి..

గల్లంతైన బాధిత కుటుంబ సభ్యుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. 12 రెస్క్యూ బృందాలు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నా పురోగతి కనిపించడం లేదు. కాగా, నాసిరకం భోజనం పెడుతున్నారని రెస్క్యూ బృంద సభ్యులు ఆందోళన చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆపరేషన్ సహాయక చర్యల పురోగతిపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవిందర్‌కుమార్ రెస్క్యూ టీం అధికారులతో బుధవారం సమీక్షించారు. కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, డీపీవో ఫిరంగి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను ఎమ్మెల్యే వంశీకృష్ణ పరిశీలించారు.

గండం గట్టెక్కేనా..?

సాగునీటిపై సందిగ్ధం

- అడిగింది 5.. ఇస్తామన్నది 4 టీఎంసీలే
- ఇప్పటి వరకు వదిలింది.. 0.45 టీఎంసీలే..
- మిగిలిన 3.5 టీఎంసీల విడుదలపై నీలినీడలు
- పంటలు గట్టెక్కాలంటే 1.2 టీఎంసీలు అవసరం
- జూరాల డ్యాంలో తగ్గుతున్న నీటినిల్వలు
- అడుగంటుతున్న ఆశలతో రైతుల ఆందోళన

కర్ణాటక కరుణిస్తేనే సాగునీరు

గద్వాల, మార్చి 5 : జూరాల ప్రాజెక్టు కింద పంటల సాగు చేసిన రైతులకు సాగునీటిపై సందిగ్ధం నెలకొన్నది. పంటలు చేతికి రావాలంటే ఇంకా 1.2 టీఎంసీల నీరు అవసరం ఉన్నది. ప్రస్తుతం పంటలకు సరిపడే నీరు ప్రాజెక్టులో లేదు. కర్ణాటక కరుణిస్తే తప్పా జూరాల ప్రాజెక్టు కింద పంటలు చేతికొచ్చే అవకాశం కనిపించడం లేదు. దీంతో మంత్రి తోపాటు ఇరిగేషన్ అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది. అయితే గత నెల మొదటి వారంలో ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రి తోపాటు ఎమ్మెల్యేలు సాగు, తాగునీటి కోసం 5 టీఎంసీలు విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఇరిగేషన్‌శాఖ మంత్రి శివకుమార్‌ను కలిసి కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేయడానికి అంగీకరించినట్లు మంత్రి, ఎమ్మెల్యేలు తెలిపారు. కాగా కన్నడ సీఎం, మంత్రిని కలిసి నెలరోజులు అవుతున్నా ఇప్పటి వరకు నారాయణపూర్ డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు కేవలం 0.45 టీఎంసీల నీటిని మాత్రమే వదిలినట్లు అధికారులే చెబుతున్నారు. ఈ నీరు కూడా కేవలం తాగునీటి అవసరాల కోసం విడుదల చేస్తున్నట్లు అక్కడి అధికారులు చెప్పడంతో జూరాల డ్యాం ఆయకట్టు పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం కర్ణాటక అంగీకరించిన ప్రకారం ఈనెల చివరి నాటికి మిగిలిన 3.55 టీఎంసీల నీరు విడుదల చేస్తే తప్పా జూరాల ప్రాజెక్టుపై ఆధారపడ్డ ప్రాజెక్టుల కింద పంటలు చేతికి వచ్చే అవకాశం లేదు. మంత్రితో పాటు ఎమ్మెల్యేలు కర్ణాటక ముఖ్యమంత్రితోపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిని కలిసిన సమయంలో మన ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారులను వెంట తీసుకెళ్లలేదు. కాగా నీటి విషయమై కన్నడ ప్రభుత్వ వదులు తామన్న నీటి విషయం తమ దృష్టికి రాలేదని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. అందుకే ఈ విషయంలో కర్ణాటక అధికారుల నుంచి తెలంగాణకు ఎలాంటి సమాచారం రాలేదు.

వరప్రదాయిని జూరాల

పాలమూరు జిల్లా వరప్రదాయిని జూరాల ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు కింద యాసంగిలో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. అయితే ప్రస్తుతం ఈ పంటలు చేతికొచ్చే వరకు డ్యాం నీరు సరిపోతుందా? లేదా? అనే దానిపై నీలినీడలు కమ్ముకున్నాయి. జూరాల ప్రాజెక్టు నీటిపైనే ఆయకట్టుతోపాటు నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ఎత్తిపోతల పథకాలు ఆధారపడి ఉన్నాయి. అయితే ప్రాజెక్టులో రోజురోజుకూ నీరు ఇంకిపోతుండడంతో రైతులు సాగు చేసిన పంటలకు చివరి వరకు అందుతుం దా..? లేదో? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందకపోతే రైతుల కష్టం అంతా బూడిదలో పోసిన పన్నీరయ్యే అవకాశం లేకపోలేదు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో యాసంగికి సంబంధించి ఆయా ప్రాజెక్టుల నీటి లభ్యత మేరకు సాగునీటి షెడ్యూలు విడుదల చేశారు. అందులో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉన్న జూరాల ప్రాజెక్టులో ఉన్న నీటిలభ్యత ఆధారంగా వారబంది ద్వారా నీటిని విడుదల చేయడానికి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రైతులు యాసంగిలో కేవలం ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని సూచించినప్పటికీ రైతులు ఎక్కువ భాగం వరి వేయడంతో ప్రస్తుత నీటి విడుదలపై సందిగ్ధం నెలకొన్నది. అధికారులు, రైతులను ఆరుతడి పంటలు వేసుకోమంటే తరి పంటలు వేసుకోవడంతో ప్రస్తుతం పంట చేతికొచ్చే వరకు నీరు సరిపోతుందా? లేదా? అనే దానిపై అధికారులు లెక్కలు వేస్తున్నారు.

జూరాల ప్రాజెక్టు కింద ప్రతిపాదిత ఆయకట్టు..

జూరాల ప్రాజెక్టు కింద నెట్టెంపాడు ఎత్తిపోతలతోపాటు కోయిల్‌సాగర్, భీమా ఎత్తి పోతల పథకాలు ఆధారపడి ఉన్నాయి. వీటితోపాటు మిషన్ భగీరథకు జూరాల ప్రాజెక్టు నుంచే నీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు ఇంకిపోతుండడంతో వేసవి కాలంలో అటు సాగు.. ఇటు తాగునీటిపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. దీంతో పాటు రామన్‌పాడు తాగునీటి పథకానికి ఈ నీటినే వినియోగిస్తున్నారు. దీంతో ఇటు రైతులు అటు ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నది. జూరాల డ్యాం పరిధిలో అధికారులు సాగునీటి విడుదల షెడ్యూల్ ప్రకారం జూరాల కుడి, ఎడమ కాల్వ ద్వారా 34,346 ఎకరాలు, నెట్టెంపాడు ఎత్తిపోతల కింద 24,800 ఎకరాలు, భీమా ప్రాజెక్టు కింద 29,000 ఎకరాలు, కోయిల్‌సాగర్ కింద 8వేల ఎకరాలకు నీటిని ఏప్రిల్ 15 వరకు విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు రైతులు పంటలు సాగు చేశారు. అయితే నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా ర్యాలంపాడు రిజర్వాయర్ కింద రైతులకు 24,800 ఎకరాలకు మాత్రమే వారబంది పద్ధతిలో సాగునీరు ఇస్తామన్నారు. అయితే ప్రస్తుతం ర్యాలంపాడు ప్రాజెక్టు పరిధిలో అధికారుల అంచనా ప్రకారం 48 వేల ఎకరాలు రైతులు పంటలు సాగు చేశారు. ఈ పంటలకు చివరి వరకు నీరు అందుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా ఈ రిజర్వాయర్ పరిధిలో 105 ప్యాకేజీ కింద డీ-5 వరకు అంటే సుమారు 10 కిలోమీటర్ల మేర పంటలు సాగు చేయాల్సి ఉండగా రైతులు 107 ప్యాకేజీ అంటే సుమారు 50 కిలోమీటర్ల మేర పంటలు సాగు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జూరాల ప్రాజెక్టు కింద రైతులు సాగు చేసిన పంటలు

ప్రస్తుతం జూరాలలో పరిస్థితి

జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 9.6 టీఎంసీలు. ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ వచ్చేసి 3.7 టీఎంసీలుగా ఉంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.35 టీఎంసీలు (లైవ్) ఉంది. ఈ నీటిని సాగునీటి అవసరాలకు వినియోగించుకోనుండగా, తాగునీటి అవసరాల కోసం 2.663 వినియోగించనున్నారు. ప్రాజెక్టు కింద తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకున్నా సాగునీటి ఇబ్బందులు తప్పేలా లేదు.

గండం గట్టెక్కేనా..?

సాగునీటి విషయంలో కర్ణాటక ప్రభుత్వంపై ఆధారపడ్డాల్సిన పరిస్థితి తలెత్తింది. తప్పా ఈ యాసంగిలో గండం గట్టెక్కే పరిస్థితి లేదు. రోజురోజుకు జూరాలలో నీటిసామర్థ్యం తగ్గుతుండడంతో ఇది గ్రహించిన మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కర్ణాటకలోని బెంగళూర్‌లో సీఎం, మంత్రిని కలిసి ఉమ్మడి పాలమూరు జిల్లాకు 5 టీఎంసీల నీరు వదిలితే ఈ యాసంగిలో సాగు, తాగునీరు అవసరాలు తీరుతాయని విన్నవించారు. అందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు 0.45 టీఎంసీలు విడుదల చేసింది. ఈ నీటిని నెట్టెంపాడు, భీమా-1, భీమా-2, కోయిల్‌సాగర్‌కు వచ్చిన నీటిని విడుదల చేశారు. అయితే ఆ విడుదల చేసిన నీరు కేవలం తాగునీటి అవసరాలకే అని కర్ణాటక ప్రభుత్వం అధికారులకు చెప్పినట్లు సమాచారం. కాగా అధికారులకు అధికారికంగా సమాచారం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కన్నడ ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు తెలంగాణకు తాగునీటి అవసరాలకే మాత్రమే నీటిని విడుదల చేసినట్లు చెబుతుండగా, సాగునీటి విషయం చెప్పకపోవడం కొసమెరుపు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకింద ఈ యాసంగిలో పంటలు చేతికి రావాలంటే ఇంకా అధికారుల అంచనా ప్రకారం 1.2 టీఎంసీల నీరు అవసరం. అది కూడా ఈనెల చివరి నాటికి అందితేనే పంటలు చేతికొస్తాయి. కర్ణాటక ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఆ దిశగా ముఖ్యమంత్రి తోపాటు జిల్లా మంత్రి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

నీటిని పొదుపు వాడుకుంటున్నాం

- రహీమొద్దీన్, జూరాల ఎస్ఈ

జూరాల ప్రాజెక్టు సామర్థ్యం తక్కువగా ఉండడం.. దీని మీద భీమా-1, భీమా-2, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆధారపడి ఉన్నాయి. అవసరాలకు తగ్గట్టు డ్యాంలో నీరు లేదు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి. తాగునీటి కోసం వేసవి ముగిసే వరకు 0.4 టీఎంసీలు వినియోగించాలి. పంటలు చేతికి రావాలంటే ఇంకా 1.2 టీఎంసీలు అవసరం. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్ననీటి ఆధారంగా వారబంది పద్ధతిలో నీళ్లిస్తున్నాం. సరిపెట్టు కోవాలంటే మూడు, నాలుగు రోజులకోసారి నీళ్లు అందిస్తున్నాం. దానిని రెండ్రోజులకు తగ్గించి పంటలు కాపాడే ప్రయత్నం చేస్తాం. ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ 15 వరకు అందిస్తాం. నారాయణపూర్ నుంచి ఇన్‌ఫ్లో తక్కువగా వస్తుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

చివరి ఆయకట్టుకు నీళ్లివ్వండి

- కలెక్టరేట్ వద్ద ఐదు గ్రామాల రైతుల ఆందోళన



గద్వాలలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

గద్వాల, మార్చి 5 : ర్యాలంపాడ్ రిజర్వాయర్ 104 ప్యాకేజీ కింద కాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు నీరు రాకపోవడంతో తమ పంటలు ఎండుతున్నాయని, నీళ్లిచ్చి కాపాడాలని బుధవారం ధరూర్, కేటీదొడ్డి మండలంలోని కొండాపురం, ఈర్లబండ, వెంకటాపురం, గువ్వలదిన్నె, గంగన్‌పల్లి, ఇర్కిచేడ్ గ్రామాలకు చెందిన రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు రాజేశ్, గోవిందర్‌రెడ్డి, బొమ్మారెడ్డి, లక్ష్మిరెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. పైగ్రామాల పరిధిలో పంటలు చివరి దశలో ఉన్నాయని, నీరు వదిలితే తప్పా చేతికి వచ్చే అవకాశం లేదని తెలిపారు. తమ పొలాలకు నీళ్లు అందక పోవడానికి కారణం కెనాల్‌పై కొందరు రైతులు అక్రమంగా మోటర్లు బిగించుకొని నీటిని వాడుకోవడమే కారణమన్నారు. వారబంధి ద్వారా నీటి విడుదల చేయడం వల్ల పంటలకు సరిపోవడం లేదన్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందాలంటే సాయంత్రం 5గంటల నుంచి ఉదయం 5గంటల వరకు కెనాల్‌పై ఉన్న మోటర్లకు విద్యుత్ సరఫరా నిలిపేస్తే చివరి ఆయకట్టుకు నీరు అందుతుందని తెలిపారు. ఈ విషయపై కలెక్టర్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చివరి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల నిరసన

గద్వాల అర్బన్, మార్చి 5 : మూడు రోజులపాటు రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయాలని వెంకటాపురం, గువ్వలదిన్నె, ఈర్లబండ గ్రామాలకు చెందిన రైతులు బుధవారం ధరూర్ మండలంలోని అల్వాల్‌పాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి వచ్చే 104 ప్యాకేజీ కాల్వ నీరు గువ్వలదిన్నె, వెంకటాపురం, ఈర్లబండ గ్రామాల చివర వరకు నీరుచేరడం లేదని వాపోయారు. ముందు వరుసలో ఉన్న రైతులు విద్యుత్ ఉండడంతో కాల్వలోని నీరు మొత్తం ఎత్తిపోయడంతో కాల్వ నీరు చివరకు రావడం లేదని, దీంతో చేతికి వచ్చిన తమ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను గుర్తించి విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న ఏడీఏ రమేశ్‌బాబు, ఏఈ అనీల్‌కుమార్ రెడ్డి అల్వాల్‌పాడు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడం తమ చేతుల్లో లేదని, ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

- ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

రాజోళి, మార్చి 5 : గ్రామాల్లో రైతు సంబురాలు నిర్వహించడం అభినందనీయమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. రాజోళి మండల కేంద్రంలో అంతరాష్ట్ర పాలపల్ల వృషభరాజముల పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి రైతులు పశువులను ప్రత్యేకంగా తయారు చేసుకొని బండలాగుడు పోటీల్లో పాల్గొని పల్లెల సంస్కృతిని చాటిచెప్పడం అభినందనీయమన్నారు. పోటీల్లో 11జతలు పాల్గొనగా, లింగాలకు చెందిన వృషభరాజములు 5వేల అడుగులు లాగి మొదటి బహుమతి, అర్షద్ బాషా, అబ్దుల్ బాషాకు చెందిన జత రెండో స్థానం, రాయవరం రాంచంద్రారెడ్డి మూడోస్థానం, గండం చెన్నారెడ్డి ఐదవ స్థానంలో, దండు వెంకటేశ్ ఆరో స్థానం, చిన్న రత్నం ఏడో స్థానం, తిరుపతయ్య, వంశీకృష్ణకు చెందిన వృషభరాజములు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వృషభరాజాల యజమానులకు వారికి ఎమ్మెల్యే విజయుడు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్, కిరణ్‌కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలి

- కేఎల్ఐ పనులను అడ్డుకున్న రైతులు

తాడూర్‌లో కేఎల్ఐ పనులను అడ్డుకుంటున్న రైతులు

ఉప్పునుంతల, మార్చి 5 : మండలంలోని తాడూర్ శివారులో జరుగుతున్న కేఎల్ఐ కాల్వ పనులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. కేఎల్ఐ కాల్వ వల్ల భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించకుం డా ప్రభుత్వం ఇష్టానుసారంగా పనులు చేస్తే తమ పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాల్వ పనుల వల్ల భూమి కోల్పోయి దిక్కులేని వాళ్లమయ్యామన్నారు. ఈ విషయంపై ఎన్నోసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, తమకు పరిహారం చెల్లించే వరకు పనులను జరగనివ్వమని స్పష్టం చేశారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

వేరుశనగ కొనుగోలు కేంద్రాని పరిశీలిస్తున్న కమిషనర్

ఉప్పునుంతల, మార్చి 5 : వేరుశనగ కొనుగోలులో ఆలస్యంపై బుధవారం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'గన్నీ గోస' శీర్షికన ప్రచురించిన కథనానికి రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు స్పందించారు. కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, జిల్లా సహకార అధికారి రఘునాథ్‌రావ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు, మార్క్‌ఫెడ్ డీఎం నర్సిహారావు, మార్కెటింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు, జిల్లా అధికారి స్వరణ్‌సింగ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, అచ్చంపేట మార్కెట్ కార్యదర్శి నర్సింహులు, ఏవో రమేశ్ తదితరులు పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా సింగిల్‌విండో కార్యాలయంలో జరుగుతున్న లావాదేవీలను పరిశీలించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, సీఈవో రవీందర్‌రావు, డైరెక్టర్లు నారంరెడ్డి, సాయిబాబ, శ్రీనివాసులు, లింగమయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేశ్‌రెడ్డి, రైతులు అనంతరెడ్డి, అచ్యుతారెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నుంచి నీటి విడుదల

- తొమ్మిది రోజులపాటు 2.6టీఎంసీల నీరు

అయిజ, మార్చి 5 : ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో యాసంగిలో సాగు చేసిన పంటలకు నీటి లభ్యత తగ్గుతుండడంతో బుధవారం కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి ఆర్డీఎస్, కేసీ కెనాల్ నీటి వాటా నుంచి 4 వేల క్యూసెక్కుల నీటిని తుంగభద్ర బోర్డు అధికారులు దిగువకు విడుదల చేశారు. 2024-25 ఏడాదికి గానూ ఆర్డీఎస్, కేసీ కెనాల్ కేటాయించిన నీటి వాటా నుంచి చివరి ఇండెంట్, కేసీ కెనాల్ టీబీ బోర్డు అధికారులు నీరు విడుదల చేశారు. 9రోజులపాటు 2.6టీఎంసీల నీటిని టీబీ డ్యాం నుంచి నీరు విడుదల చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఉత్తర్వుల మేరకు టీబీ బోర్డు కార్యదర్శి నాగమోహన్‌కు ఇండెంట్ పెట్టారు. దీంతో టీబీ బోర్డు అధికారులు డ్యాం నుంచి తుంగభద్ర నదిలోకి నీటిని విడుదల చేశారు. రోజుకు 4వేల క్యూసెక్కుల చొప్పున ఈనెల 13 వరకు టీబీ డ్యాం నుంచి నీటి విడుదల కొనసాగనున్నదని ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 9వ తేదీ నాటికి కర్ణాటకలోని ఆర్డీఎస్ కు చేరుకుంటుందని తెలిపారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పంటలకు చివరి తడులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాలుడిపై సవితితల్లి చిత్రహింసలు

- ఎస్పీకి ఫిర్యాదు
- కేసు నమోదు

వనపర్తి టౌన్, మార్చి 5 : సవితితల్లి పెట్టే బాధలను భరిస్తున్న బాలుడిని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ చేరదీసి భరోసా కల్పించారు. వివరాల్లోకి వెళితే.. పెబ్బేరు మండలం సూగూరుకు చెందిన గొల్లనర్సింహ, వనితకు ఒక కుమారుడు ఉన్నాడు. కాగా, వనిత అనారోగ్యంతో రెండేండ్ల కిందట మృతిచెందింది. దీంతో నర్సింహ సమీప బంధువైన లక్ష్మిని రెండోపెళ్లి చేసుకున్నాడు. పెళ్లైనకొత్తలో లక్ష్మి వనిత కుమారుడిని బాగానే చూసుకున్నా తర్వాత చిత్రహింసలకు గురిచేస్తూ వస్తున్నది. మితిమీరి నిప్పులో కాల్చిన సలాకీతో కాల్చడం చేయడంతో భరించలేక బాలుడు అతడి తండ్రికి విషయం చెప్పాడు. అయినా ఫలితం లేకపోవడంతో మంగళవారం బాలుడు తన మేనమామ రామచంద్రయ్యకు ఫోన్ ద్వారా విషయం తెలిపాడు. రామచంద్రయ్య బాలుడిని తీసుకొని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి చేరుకొని వివరాలు వెల్లడించారు. బాలుడిని ఎస్పీ రావుల గిరిధర్ చేరదీసి తన తోపాటు నివాసగృహానికి తీసుకెళ్లి భోజనం పెట్టించి వివరాలను తెలుసుకున్నారు. వెంటనే రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా అధికారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, భరోసా కేంద్రం కో-ఆర్డినేటర్ల ద్వారా బాలుడు ఎదుర్కొన్న మనోవేధనను, చిత్రహింసల వివరాలను సేకరించాలని సూచించారు. వారు అందించిన వివరాల ఆధారంగా నిందితురాలిపై పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకున్నారు. బాలుడికి భయం వీడేలా కౌన్సెలింగ్ ఇప్పించి జిల్లాలోని ఏదేని పాఠశాలలో చేర్పిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

విద్యార్థులను తనిఖీ